నీటి వినియోగంపై అవగాహన



పాన్‌గల్‌లో మిషన్ భగీరథ ట్యాంకు వద్ద ఏఈ, స్థానికులు



ఆత్మకూర్‌లోని కార్మికులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాన్‌గల్: ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తైన సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలో ఆర్‌డబ్ల్యూఎస్ (మిషన్ భగీరథ) ఆధ్వర్యంలో రక్షిత తాగునీటి ట్యాంకు వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనుదీప్‌రెడ్డి మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా అయ్యే నీరు శుభ్రమైందని, నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, స్థానిక నాయకులు, గ్రామ పంచాయితీ, మిషన్ భగీరథ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూర్: అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని, ప్లాస్టిక్ నిర్మూలన, పరిసరాల శుభ్రతకు అందరు కట్టుబడి ఉండాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ శశిధర్ అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కార్మికులకు పూల మాలలతో సత్కరించి సమగ్ర రక్షణ్ పథకంలో భాగంగా రూ.10 లక్షల ఇన్సూరెన్స్ పత్రాలను అందజేశారు.

క్లుప్తంగా

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె నోటీస్



పాన్‌గల్: సమగ్ర శిక్షా ఉద్యోగులు (ఎస్ఎస్ఏ) తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు శాంతియుత నిరసన దీక్షల సందర్భంగా ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది గురువారం ఎంఈఓ శ్రీనివాసులకు సమ్మె నోటీస్ ఇచ్చారు. ప్రభుత్వం స్పందించకపోతే 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని ఉద్యోగులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది శేఖర్‌నాయక్, మూర్తి, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి వాటర్ ఫిల్టర్ వితరణ



అమరచింత: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయానికి సూర్యచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ఫిల్టర్‌ను గురువారం గురుస్వాములకు అందించారు. ప్రతి సంవత్సరం మాలధారణ చేసిన భక్తులు ఆలయ సన్నిధానంలో ఉంటూ బిక్ష చేస్తారని, వారికి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశ్యంతో వాటర్ ఫిల్టర్‌ను అందించామని ఆ సంస్థ నిర్వాహకుడు దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు గురుస్వాములు దాతను సత్కరించారు.

నీటి వృథాను అరికట్టండి



శ్రీరంగాపూర్: మండలంలోని తాటిపాముల వీర సముద్రం చెరువు నుంచి వృథాగా నీరు పోతుందని గ్రామానికి చెందిన రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. గురువారం ఈఈ కేశవరావు, డీఈ కిరణ్‌కుమార్ చెరువు కట్టను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ తూం నుంచి నీరు వృథాగా పోతుందన్నారు. చెరువులో నీరు ఎక్కువగా ఉండడంతో మరమ్మతులు చేయలేమని, నీరు తగ్గిన తర్వాత పనులు చేస్తామని రైతులకు వివరించారు.

ఆరు గ్యారంటీలు వద్దు.. ఐదు గ్యారంటీలు ముద్దు



కొత్తకోట రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు వద్దని, ఐదు గ్యారంటీలను అమలు చేయాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరపాగ రామకృష్ణ డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో డీఎస్పీ నిర్వహిస్తున్న రిలే నిరహార దీక్ష నాలుగో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరపాగ రామకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలందరికీ మౌలికమైన సదుపాయాలు కల్పించకుండా ప్రజాస్వామ్యబద్ధంగా కల్పించాల్సిన విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు కల్పించకుండా రాజ్యాంగ వ్యతిరేకంగా పరిపాలన చేస్తూ 3కోట్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ, ప్రజలను మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కుర్మన్న, అశోక్, నత్తి సుధాకర్, ఎల్లస్వామి, నాగరాజు, ఈశ్వర్, స్వామి, రాములు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



అమరచింత: ఏపీలోని అన్నమయ్య జిల్లా రాయచోటిలో ప్రభుత్వ విద్యార్థుల దాడిలో మృతి చెందిన ఉపాధ్యాయుడి ఆత్మకు శాంతి చేకూరాలంటూ గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రార్థన అనంతరం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ఆగడాలు పెరిగిపోయాయని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించి వారు మంచి మార్గంలో నడిచేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, సీఆర్పీ స్వామి పాల్గొన్నారు.

బుద్దారం గురుకుల పాఠశాలలో అన్నీ సమస్యలే!



గురుకుల పాఠశాలలో డ్రైయినేజీని పరిశీలిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాలలో అన్నీ సమస్యలే ఉన్నాయని బీఆర్ఎస్వీ నాయకుడు శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. గురువారం ఆయన గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని సరుకుల గది, వంట గదులు, కూరగాయలు, ఇతర వంట సామగ్రిని పరిశీలించారు. కూరగాయలు కొన్ని కుళ్లిపోయే స్థితిలో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు భోజనాలు చేసే డైనింగ్‌హాల్‌కు సమీపంలోనే డ్రెయినేజీ లీకేజీ అయిందని ఇలా ఉంటే విద్యార్థులు ఇబ్బందులు పడరా అని ప్రిన్సిపాల్ ఆరోగ్యను ప్రశ్నించగా.. సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. ఎక్కువ సేపు పాఠశాలలోకి అనుమతి లేదని, పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి వస్తుందని బెదిరించారన్నారు. విద్యార్థుల సమస్యల గురించి ప్రశ్నిస్తే ఇలా పోలీసులను పిలుస్తామని బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు పాఠశాలపై దృష్టి సారించి సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్వీ జిల్లా ఇన్‌చార్జ్ శివయాదవ్, కోఆర్డినేటర్ హేమంత్, అమరేందర్, శివప్రసాద్, లక్ష్మణ్‌గౌడ్, నవాజ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపాలి



ఆందోళన చేస్తున్న హిందూ జాగృతి సభ్యులు

పెబ్బేరు రూరల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగే అరెస్టులు, దాడులను ఆపాలని హిందూ జాగృతి సంఘం నాయకుడు వేణు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం హిందూ జాగృతి ఆధ్వర్యంలో బంగ్లాదేశ్ విధానాలను వ్యతిరేకిస్తూ నిరసనలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ దేవాలయ చైర్మన్ చిన్మయ్ కృష్ణదాస్‌ను అరెస్టు చేసి, హిందూ ఆలయాలపై దాడులు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. స్థానిక మున్సిపాలిటీ కేంద్రంలో బంగ్లాదేశ్ ప్రధాని చిత్రపటానికి చెప్పుల దండ వేసి సుభాష్ చంద్రబోస్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బంగ్లాదేశ్ ప్రధాని చిత్రపటానికి నిప్పంటించి ఆందోళన చేపట్టారు. ఈ అరెస్టులు, దాడులు ఇలాగే కొనసాగితే బంగ్లాదేశ్ అనే దేశం లేకుండా చేస్తామని హిందూ సంఘం నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో హన్మంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాఘవేంద్రరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, బాలరాజు, శంకర్‌శెట్టి, సహదేవుడు, కంచె అంజి అస్కాని ఆనంద్, సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఆవరణలో క్షుద్రపూజలు



ముగ్గును పరిశీలిస్తున్న ఏఎస్ఐ రాములు

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహించారు. గురువారం ఉదయం కళాశాలకు వచ్చిన లెక్చరర్లు, సిబ్బంది ఆవరణలో వేసిన ముగ్గు, జిల్లేడు ఆకులు, పసుపు, కుంకుమ, నిమ్మకాయలను చూసి భయాందోళనకు ఆందోళనకు గురయ్యారు. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా ఏఎస్ఐ రాములు సిబ్బందితో కళాశాలకు చేరుకుని వివరాలు ఆరా తీశారు. ఎవరూ భయాందోళనకు గురికావొద్దని చెప్పి, నీటితో అక్కడున్న ముగ్గును శుభ్రం చేయించారు.

ఉపాధ్యాయ భవన అక్రమ రిజిస్ట్రేషన్ నిలిపివేయాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఆత్మకూర్: ఉపాధ్యాయ సంఘం భవనాన్ని అక్రమంగా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయడాన్ని నిరసిస్తూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఆయా ఉపాధ్యాయుల సంఘాల నాయకులు ఎంఈఓ కొండాపురం బాలరాజు నేతృత్వంలో సమావేశమయ్యారు. 1956లో ఆత్మకూర్‌లో ఉపాధ్యాయులు చందాలు వేసుకుని విశ్రాంత భవనాన్ని నిర్మించుకున్నారు. నాటి నుంచి ఉపాధ్యాయుల సమావేశాలు అక్కడనే నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఈఏడాది అక్టోబర్ 25వ తేదీన రూ.50లక్షలకు పుట్ట శేఖర్ అనే వ్యక్తికి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని ఉపాధ్యాయులు ఆరోపించారు. పోలీసులు ఈవిషయమై సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్పీరత్నం, వీరన్న, ఉమాశంకర్, రియాజుద్దీన్, దోమ శ్రీను, అనురాధ, బాలస్వామి, రాఘవేందర్, విజయ్, అగ్రీప, రాము, సత్యం, శ్రీనివాసులు, వెంకటన్న, విజయభాస్కర్ తదితరులు ఉన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి



అప్పారెడ్డిపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న ఏడీఏ చంద్రశేఖర్

పాన్‌గల్: రైతులు తమ పొలాల మట్టి పరీక్షలు చేయించుకుంటే వాటి ఆధారంగా పంటల సాగు, ఎరువులను ఉపయోగించే వీలు ఉంటుందని ఏడీఏ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు నేల సారం, మట్టి పరీక్షకు సంబంధించి ఏ విధంగా రైతులు తమ యొక్క నమూనాలను పంపించాలనే అంశంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో ఏఓ రాజవర్ధన్ రెడ్డి, ఏఈఓలు అఖిల, వెంకటేష్, శైలజ, నరేష్, షర్మిల, రైతులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లయ్య, ఏఈఓలు పవన్‌కళ్యాణ్, పాండు అన్నారు. గురువారం ప్రపంచ మృతిక(నేల) దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంతో పాటుగా మండలంలోని క్లస్టర్ల పరిధిలోని రైతువేదికల్లో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. పలు గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో పాల్గొన్న వారు మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో మట్టి పరీక్షలు నిర్వహించుకోవడం వలన ఎలాంటి పంటలు, తోటలు సాగు చేస్తే ఉపయోగంగా ఉంటుందని తెలుస్తుందన్నారు. రైతుకు భూమి అంటే ఎంతో మక్కువ అన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

పాన్‌గల్: మండలంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపర్చగా.. ఒకరికి జరిమానా, మరొకరికి రెండు రోజులు జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం సిబ్బందితో కలిసి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా అన్నారం గ్రామానికి చెందిన సురేష్, బీచుపల్లికి పరీక్షలు నిర్వహించగా.. వారు మద్యం తాగినట్లు నిర్ధారణ అయింది. దీంతో పాటు పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్నారు. ఇద్దరు వ్యక్తులను గురువారం వనపర్తి కోర్టు నందు హాజరుపర్చగా జడ్జి సురేష్‌కు రూ.1000 జరిమానా, బీచుపల్లికి 2 రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లిలో పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీస్ అధికారి శాంతన్న చెప్పిన వివరాల ప్రకారం.. లక్ష్మీపల్లికి చెందిన ఇటిక్యాల వెంకటస్వామి తన ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి తాళం విరగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాను పగలగొట్టి, దాంట్లో ఉన్న 6తులాల బంగారు, రూ. 50వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనపై కేసును నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్ సమీపంలో గురువారం నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి, పట్టుకున్నామని ఎస్ఐ రాణి తెలిపారు. ఈ సందర్భంగా వారిపై కేసు నమోదు చేసి, వారి నుంచి రూ.9,190 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేకమైన చర్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి



అమరచింత: మహిళలు ఇంటికే పరిమితం కాకుండా కుట్టు మిషన్ నేర్చుకుని తమ కుటుంబ పోషణలో భాగస్వాములు అయ్యేందుకు ఉచితంగా ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, శ్రీరామనంద తీర్థ రూరల్ ట్రస్టు డైరెక్టర్ లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని డీఎంఆర్‌ఎం ఆస్పత్రి వెనకాల ఉన్న భవనంలో కొన్నేళ్లుగా తమ సంస్థ ద్వారా ఉచితంగా కుట్టుతో పాటు ఎంబ్రాయిడరీ శిక్షణ అందిస్తున్నామన్నారు. మహిళలు తమ లక్ష్య సాధన కోసం దృష్టి పెట్టాలని, అప్పుడే అనుకున్న విధంగా తమ కుటుంబాన్ని ముందుకు తీసుకెళ్తారన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ విహారికృష్ణ, శిక్ష కురాలు శివలత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

పాన్‌గల్: టీపీసీసీ బుధవారం ప్రకటించిన యువజన కాంగ్రెస్ ఫలితాల్లో కొల్లాపూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్‌గా పాన్‌గల్‌కు చెందిన ఎండీ అస్లాం , యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా చింతకుంటకు చెందిన మినిగ గిరిబాబు ఎన్నికయ్యారు. వీరిద్దరి గెలుపునకు సహకరించిన ప్రతి కార్యకర్తకు, ప్రతి ఓటరుకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంతో పాటు, నియోజకవర్గంలో యువజన కాంగ్రెస్ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. వీరిద్దరి గెలుపుపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీతోనే పేదలకు సంక్షేమం



మాట్లాడుతున్న కొండా ప్రశాంత్‌రెడ్డి

కొత్తకోట: నిత్యం ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసే పార్టీ బీజేపీయే అని ఆ పార్టీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండ ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీ గురువారం కొత్తకోటలో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ అధికార కాంగ్రెస్ ప్రజలకు ఎన్నికల ముందు 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను వివరించడానికి భారతీయ జనతా పార్టీ 6 గ్యారంటీలు, 66 మోసాలు అనే నినాదంతో ప్రజల ముందుకు వచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అంబేడ్కర్ హస్తం పేరిట దళితులకు రూ.12 లక్షలు ఇస్తానని చెప్పి ఒక్క రూపాయి ఇవ్వలేదని మండిపడ్డారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీజేపీ సత్తా చాటాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నాగూరావు నామాజీ, రాజవర్ధన్‌రెడ్డి, కొమ్ము భరత్‌భూషణ్, సాయిరాం, రాధాకృష్ణ, మాధవ రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం



భోజనం పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నంబావి: ప్రభుత్వ హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్ అన్నారు. ఆయన మండలంలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించి, వంట గదిని కూరగాయలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందుతుందని విద్యార్థులే చెబుతున్నారని, కావాలనే ప్రతిపక్ష పార్టీలు రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగారి శ్రీనివాసులు, సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

ఘన నివాళి

వనపర్తి టౌన్: నెల్సన్ మండేలా 11వ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజావాగ్గేయకారుడు రాజారాంప్రకాష్, బూరోజు గిరిరాజాచారి, నాయికంటి నర్సింహాశర్మ, గంధం నాగరాజు, మండ్ల దేవన్ననాయుడు, బాలేమియా, శివశంకర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, జ్ఞానేశ్వర్ ఉన్నారు.

సెల్‌ఫోన్ల వాడకంతో కంటి సమస్యలు



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్

గోపాల్‌పేట: సెల్‌ఫోన్లు ఎక్కువగా వాడటం ద్వారా విద్యార్థులు, పెద్దలకు కలిగే నష్టాల గురించి గురువారం ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. గోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో ఏదుల, గోపాల్‌పేట మండల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సెల్‌ఫోన్ వాడకంపై ప్రభుత్వం ద్వారా నియమించబడిన ఇద్దరు ఫిజియో థెరపిస్టుల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు సెల్‌ఫోన్‌ను అదే పనిగా చూడటం ద్వారా మెడనొప్పులు, సయాటికా, మైగ్రేన్, వంటి సమస్యలు వస్తాయన్నారు. ప్రస్తుతం మైగ్రేన్, సయాటికా, మెడనొప్పుల బారిన పడిన వారు ఎలా బయటపడాలనే విషయాలను వారికి వివరించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

అమరచింత: పాఠశాల సమయానికి ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం కొంకన్‌వానిపల్లిలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ మాట్లాడుతూ నారాయణపేట ఆర్టీసీ డిపో, వనపర్తి డిపోలకు చెందిన షటిల్ సర్వీస్‌లు ప్రతిరోజు ఉదయం ఏడింగిటికి, ఎనిమిది గంటలకు నడపాలని డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన 80 విద్యార్థులు ఆత్మకూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వనపర్తిలోని డిగ్రీ కళాశాలతో పాటు ఆత్మకూర్, అమరచింతలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు నిత్యం వెళ్తుంటారన్నారు. ఆర్టీసీ సౌకర్యం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. బస్సులు నడపాలని పలుమార్లు డిపో మేనేజర్‌కు వినతి పత్రాలు ఇస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారని వాపోయారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చొరవ చూపి పాఠశాల వేళలకు బస్సులు నడుపాలని కోరారు.

సీఎం కప్ పోటీలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గోవింద్‌రావు

పాన్‌గల్: ఈనెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు సీఎం నిర్వహించే పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ గోవింద్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వివిధ పాఠశాలల పీఈటీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈనెల 7, 8వ తేదీల్లో గ్రామ స్థాయిలో ఆటలను నిర్వహించాలని, ప్రతిభ చూపిన వారికి ఈనెల 10, 12వ తేదీల్లో మండల స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోటీల్లో విద్యార్థులతో పాటు 15 ఏళ్ల నుంచి 36 ఏళ్ల లోపు వారికి కూడా అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, ఫుట్‌బాల్‌తో పాటు వ్యక్తిగత పోటీలను నిర్వహిస్తారన్నారు. సమావేశంలో ఎంఈఓ శ్రీనివాసులు, ఎస్ఐ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ అశోక్, ఎంపీఓ రఘురాములు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు చూపడం లేదని ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బాధితులు

అమరచింత: పట్టణంలోని సర్వేనంబర్ 582బై2లోని మూడు ఎకరాల పొలంలో 1993లో ప్రైవేట్ వ్యక్తులు వెంచర్‌ను ఏర్పాటు చేసి ఇంటి నిర్మాణాల కోసం ప్లాట్లను విక్రయించినా.. ఇప్పటి వరకు స్థలాలను చూపడం లేదంటూ తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ కమిషనర్‌కు బాధితులు సీపీఎం ఆధ్వర్యంలో వినతి పత్రాలను అందించారు. పట్టణానికి చెందిన ఎల్లా సుదర్శన్, ఎల్లా బాలస్వామి తమ మూడు ఎకరాల పొలంలో వెంచర్ చేసి స్కీం ద్వారా డబ్బులను కట్టుకుని ప్లాట్లను విక్రయించారు. ప్లాట్ల వివరాల ప్రకారం వ్యక్తిగతంగా బాండ్ పత్రాలను రాసి ఇచ్చారని, రిజిస్ట్రేషన్‌కు మాత్రం చేయలేదన్నారు. 31 ఏళ్లుగా సమస్య పరిష్కారం కావడం లేదని, అధికారులు చొరవ చూపి తమకు ఇంటి స్థలాలను చూపాలని లేని పక్షంలో వెంచర్‌లోని ముళ్ల పొదలను శుభ్రపరిచి తామే హద్దులను పాతుకుంటామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జీఎస్.గోపి, నాయకులు ఆర్ఎన్ రమేష్, వెంకటేష్, బాధితులు కేజీ కృష్ణారెడ్డి, చాకలి వెంకటేష్, కటిక నరేందర్, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు అవకాశాలు అందిపుచ్చుకోవాలి



బహుమతులు అందిస్తున్న అధికారులు

గోపాల్‌పేట: దివ్యాంగులకు సరైన ప్రోత్సాహం ఉంటే అన్ని రంగాల్లో రాణించగలరని రేవల్లి ఎంఈఓ బాల్‌రెడ్డి అన్నారు. ఈనెల 3న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రేవల్లి మండల కేంద్రంలో ఆయా గ్రామాలకు చెందిన దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించి ప్రోత్సాహకాలు, బహుమతులు అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఈ కోఆర్డినేటర్ మానిక మాట్లాడుతూ అంగవైకల్యం ఉన్న విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచే అందరితో సమానంగా గౌరవిస్తూ అవకాశాలు కల్పించడం ద్వారా వారు మరింత ఉత్సాహంతో ముందుకెళ్తారన్నారు.